

# ఎవరితరమమ్మా ఉద్యోగితో కాపురం

నందగిరి ఇందిరాదేవి

"అబ్బబ్బ! ఆయనతో వేగలేకుండా ఉన్నాను బాబూ" అని అనిపించిన క్షణాలే నిజానికి జీవితంలో మధుర మయినవి పెట్టింది తిని, చెప్పింది విని, బుద్ధిగా ఉన్న పిల్లలమీద కాక కాస్త అల్లరి చేసేవాళ్ల మీదే తల్లికి ఎక్కువ మమకారం, చూశారో లేదో! అట్లాగే మనం సొంతం చేసుకుని కంటికి రెప్పలాగా కాపాడుకుంటున్న ఆ వ్యక్తి ఎంత ఏడిపించుకతిన్నా హృదయం లోనుంచి ప్రేమాభిమానాలు పెల్లుబికి ఆ విధంగా అనిపిస్తాయి మన నోటినుంచి 'ఎవరి తరమమ్మా ఈయనతో కాపరం'' అని.

"లొంగతీసుకునే విధానం తెలిస్తే సరి! ఎంతటి పోట్లగొడ్డు అయినా ఇట్టే లొంగిపోతుంది" అంటుంది మన కాంతం' నిజమే మరి! కొత్తలో కొంత కష్ట మయినా రానురాను దంపతులు ఒకరి నొకరు అర్థం చేసుకునే సరికి జీవితాలు ఆనందంగా ప్రశాంతగా గడచి పోతాయి. కాని, ఆ విధానం కొందరికి అతి తొందరగా తెలుస్తుంది, కొందరికి జీవిత మంతాకూడ తెలియదు. అయినా ఒక్క సంగతి ఏమిటంటే ఈ కాపరం ఎవరితరం అని ఎంత విసుగు పడ్డా, మనకు ఎంతకోపం వచ్చినా ఆ ఎదటి వ్యక్తి కాస్తంత నిమిరి ఆ వెచ్చని గుండెల్లోకి లాక్కునే సరికి అంతా మరచిపోయి కరిగి నీరయిపోతాము. అందుకే అంటారు, 'పూజ కొద్ది పురుషులు, దానం కొద్ది బిడ్డలు' అని.

కాని కొందరుంటారు. ఆ గుండెల్లో అంతా కల్మషమే! ఆ భర్తల సాధింపులు చూస్తే అత్తగారు ఎందుకు అనిపిస్తుంది. ఎంత అనుకూలంగా ఉండాలని ప్రయత్నించినా అర్థంచేసుకోక తమ జీవితం, ఇతరుల జీవితం దుఃఖభాజనం చేసే స్వభావాలు వాళ్లవి. సరే! ఆ దుర దృష్టవంతులను వొదిలేస్తే ఆనంద


సుధామయ జీవితంలో ప్రతి ఒక్క అనుభవం ఒక కళా ఖండం! మధురాతి మధురం! ఆ మధురానుభూతులు తలచుకున్నప్పుడల్లా ''చక్కిలిగింత పెట్టి సుళ్లు తిరిగి ఆనందాన్నిస్తాయి''. ఆ దృష్టితో చూస్తే కాంతం జీవితంలోని ప్రతి చిన్న సంఘటన కూడా హృదయానికి ఆహ్లాదాన్నిస్తుంది. కందిపచ్చడి తేప తేప అడిగినందున, భర్త అనుకొని అతిథి బుగ్గలు సాగదీయటం — అత్తగారింట్లో పేరు చెప్పమంటే చేసిన హంగామా లాంటివి తలుచుకొని కాంతం కూడా అనుకొని వుంటుంది, 'ఇట్లాంటి ఆయనతో కాపరం ఎవరి తరమని!'

అసలు ఈ ఉద్యోగం చేసే వాళ్లకు ఎంత పరధ్యానం అనుకున్నారు, నిజంగా హద్దులు మీరుతుంది ఆ పరధ్యానం అంటే 24 గంటలూ తమ పని ధ్యాసలో మునిగి అదొకరకపు నిషాలో ఉంటారు వాళ్లకు ఏమి చెప్పినా లాభంలేదు ఒకసారి ఒక సైంటిస్టు గారి భార్య ఊరికి వెడుతూ ఒక అర్జెంటు ఉత్తరం పోస్టు చేయమని చెప్పింది అతను ఆమెను బండెక్కించి ఇంటిదారి పట్టాడు పది గజాలు నడిచాడో లేదో ఎవరో ఒకతను — పరిచయంలేదు ఏమీలేదు. "ఏమండీ ఉత్తరం పోస్టు చేశారా" అని అడిగాడు. ఏదో ఆలోచిస్తూ వెడుతున్న ఆయనగారు ''ఆఁ! ఆఁ!'' వేస్తాను అన్నాడు మరో పది గజాలు వెళ్లాక ఇంకొకాయన "ఉత్తరం పోస్టు చేయండి" అని చెప్పాడు. ఇంకొకాయన, ఇంకొకాయన మరీమరీ జ్ఞాపకం చేస్తుంటే విసుగుపుట్టి "మీకెవరుచెప్పారు ఉత్తరం పోస్టులో వేయాల్సి ఉందని" అని అరిచాడట కోపంతో కోటుకు పిన్నుతగిలించిన అట్టముక్క తీసి చేతికిచ్చి వెళ్ళిపోయాడు ఆ అడిగిన అతను. అందులో "దయచేసి ఉత్తరం పోస్టు చేయమని జ్ఞాపకంచేయండి" అని వ్రాసి ఉంది. అతనికి జ్ఞాపకం ఉండదని ఆ యిల్లాలు చేసిన ఉపాయం అది! ఏం చేస్తాం ఇట్లాంటి వాళ్లతోటి!

పరధ్యానం, జ్ఞాపకం లేకపోవటం ఎంతవరకూ అంటే టేబులు మీద భోజనం పెట్టి దగ్గర కూచోక పోతే సగంకలుపుకు తిని మంచి నీళ్లు తాగి మరచిపోయి ఆఫీసుకు పరుగెడతారు మావారు ఒకసారి ఒక లాయరు స్నేహితుడు వచ్చాడు మా యింటికి. మతిమరుపులో ఈయన్ని మించినాయన. భోజనాలు అవీ అయ్యాక బట్టలు వేసికొని కోర్టుకు వెళ్లే ముందర ఒక కాగితం తీసి ఎర్రపెన్సిలుతో అన్నీ టిక్కులు పెడుతున్నాడు. ఏమిటా అని చూస్తే కోటు—పాంటు — షర్టు — కాలరు బాండ్సు, సాక్సు — బూట్లు, అని లిస్టు వ్రాసి ఉల్టా కాకుండా చూడాలి అని రెండుసార్లు ఎర్ర గీతలతో అండర్‌లైను చేసివుంది. పాపం ఆ బ్రహ్మచారి మరచిపోకుండా

వుండేందుకు జాగ్రత్తచూస్తే నవ్వొచ్చింది ఇంకో లాయరు స్నేహితుని 'నీపిల్లల పేర్లేమి' టని అడిగితే 'ఏమో జ్ఞాపకం లేదు' అన్నాడు. ఇంతకన్నా విపరీతం ఇంకేమన్నా ఉంటుందా చెప్పండి! ఏ వృత్తిలో ఉన్నా వీళ్ల తత్వాలు అన్నీ ఒకటే ననిపిస్తుంది.

అసలు వేపకాయంత వెర్రి ప్రతి వాళ్లకు ఉంటుందంటారు. కాని బాబూ మావారికి మాత్రం వెలక్కాయంత ఉన్నదేమోననిపిస్తుంది. అదీ లీగల్ వెర్రి. ఎప్పుడూ చట్టాలు, శాసనాలు, తీర్పులు తప్పితే వేరే లోకమే లేదు! బాంకుకు పోవటం — బిల్లులు కట్టటం — సామాన్లు తెప్పించుకోటం పిల్లల చదువులు చూడటం — అతిధి అభ్యాగత మర్యాదలు పాటించటం—ఒకటేమిటి! ఇంటి మానేజిమెంటంటే మాటలా! ఇంట్లో అతిధి మోస్తరు ఉండటం తప్ప ఏమీ పట్టించుకోని ఈ వ్యక్తితో విసుగుపుట్టి "అబ్బబ్బ ఉరి పెట్టుకోవా లనిపిస్తుంది" అని అంటే, ఫైళ్లకట్టల్లోంచి తల పైకెత్తకుండా, "ఆ! దానికేం! మహారాజులాగా పెట్టుకో" అంటారు, అదేదో నగ అయినట్టు. ఇన్ని సమర్ధించుకు పోతున్నా రాత్రి జడ్జిమెంటు డిక్టేషను తీసుకొని, టైపుచేసి పెట్టక పోతే ఏమీ పనిచేసిన దాంట్లో జమకాదు. పొద్దంతా ఏవో పనులతో సతమతమయి రాత్రి డిక్టేషను తీసుకోటానికి బద్ధకించి చేతులకు గోరింటాకు పెట్టుకున్నాను ఒకసారి పనికి బద్ధకిస్తే మహా చికాకు వారికి. ఆఫీసులో వాళ్ల ప్రాణాలు కొరుక్కు తినేస్తారనిపిస్తుంది గోరింటాకు చేతులు పండకముందే కడిగించి కూచోబెట్టేటప్పటికి నమిలి మింగాలన్నంత కోపం వచ్చింది. అయినా చేసేదిలేక కూచున్నాను టేబిల్ దగ్గర అనర్గళమయిన ధారతో చెప్పుకు పోతున్నారు. ఒక పది నిమిషాలయ్యాక మళ్లా చదవమన్నారు. "నననననన న, కామ, నననన పుల్ స్టాప్" అని అంటుంటే నిజంగా అగ్గి అయిపొయ్యారు "ఏమిటీ! నననన ఏమిటీ నా తలకాయి" అని



"ఏం మాష్టారూ! హోటల్ నుంచి భోజనం తెస్తున్నారు, ఇంట్లో ఆడవారు లేరా?"

"మా ఆవిడ శాసనసభకు ఎన్నికయిందిగా. ఆమెకు వ ఉండట."

ఉరిమారు. "మరి మీరు అంత వేగంగా చెప్పుతుంటే అట్లాగే వినబడింది" అన్నాను కొంగు చాటున నవ్వుతూ, "ఛా తెలివి తక్కువ దానా!'' అని వెళ్ళ గొట్టారు. వారు నాపట్ల ఈ అభిప్రాయం బలపరచటం ఇది ఎన్నోసారో' ఇహ పోతే కొన్ని సార్లు పొద్దున్నే ముఖం కడుక్కుంటూ సివిల్ ప్రొసీజరు వాల్యూం నం.2లో 0 15 2 4 తీసి చదువు అంటారు. రెండు నిమిషాల్లో చదివేసి పరిగెత్తబోతే Case law తీసి పెట్టూ అంటారు. ఉదయంపూట తల మునిగేంత పని!ఆరోజు మరీ పొద్దెక్కిందిలేవటానికి సిలల తొందర—వంట హడావిడి—ఇన్నీ

నదవకముందే

no 4 1. no2

కింది పొయ్యిమీద పప్పు మాడిపోతోంది" అన్నాను సీరియసుగా! ఆ! ఏమిటీ! అన్నారు ఈ ప్రొసీజరు ఎక్కడిదిరా అనుకొని వుంటారు. ఒక్క క్షణం మళ్ళీ ఈ ప్రపంచంలో పడి— బలే' గడుసుదాని వవుతున్నావు అన్నారు ఆ ఒక్క మాటలో ఎంత విలువ ఉందో'

మొన్న ఒక తమాషా జరిగింది. సాయంకాలం చల్లగాలికి టాంకుబండు మీద కూర్చున్నాము. పల్లెతిరిగినా మూడే సోళ్ళు పట్నం తిరిగినా మూడే సోళ్ళు అన్నట్టు ఎక్కడ కూచున్నా ఒకటే ఆలోచన! ఏవో కబుర్లు చెప్పి కాస్త నవిద్దా మనుకుంటూ ఉంటే ఒక మీసాలాయన మా కారు పక్కనుంచి వెళ్లాడు. వారి వీపుతట్టి 'చూడండీ ఇప్పు డెళ్లాడే ఆయన—ఆయనకు ఒకప్పుడు బలే పెద్ద మీసా లుండేవట' ఈ బండు మీద ఇట్లా నిలబడితే ఇటు అరమైలు ఆటు అరమైలు. ట్రాఫిక్కు క్లోజు అయ్యేదట' అన్నాను తక్కిందంతా విన్నారో లేదో ట్రాఫిక్కు క్లోజు అన్నమాట వినబడి ఉంటుంది. "అట్లా క్లోజు కావటానికి వీల్లేదే'' అన్నారు. పొట్ట చక్క లయ్యే టట్లు నవ్వొంచ్చింది.


ఇంకో సంగతి ఏమిటంటే ఉదయం స్నానాల గదిలో పీటమీద ఉండాల్సిన చెంబు, కిటికీ గోడ ఎక్కటం — సబ్బు పెట్టెలో నీళ్లు ఉండటం ఈ రెండూ చట్ట విరుద్ధమయిన పనులు జరగటం మూలాన మా వారికి బలే కోపం వస్తుంది. ఆ బుద్ధిలేని చెంబు ఎన్ని సార్లు దించినా మళ్లీ కిటికీ ఎక్కనేఎక్కుతుంది. కొత్తలో వారికి కోపం వస్తే హడలి పొయేదాన్ని. ఇప్పుడు వారు కోప్పడు తుంటే ఏదో నిండుగా సరదాగా ఉంటుంది. ఏదో పెద్దఘోరం జరిగినట్టు గోల చేసేస్తారు. పోనీ ఆ ఎక్కిన చెంబును కాస్త దించితే పోదూ! అహ! అది మళ్లీ నేను వెళ్లి దించాల్సిందే! ఎందుకూ అంటే ఒకరోజు తాను దించితే అదే అలవా టవుతుందట ఆ చెంబుకు! అయినా నా పర్యవేక్షణలో వున్న ఆ చెంబు

అదే పనిగా గోడ ఎక్కుతుంటే ఎన్నడో నన్ను డిస్మిస్ అంటారు!

ఎంత మనం వాళ్లకు లొంగిఉన్నా ఒక్కొక్కసారి మన వ్యక్తిత్వం కూడా నేనున్నాననిపిస్తుంది 'డిక్టేషను తీసుకుంటున్నాను ఒక రోజు అది ఒక హత్యకేసు. పసిపిల్లను చంపి నగలు అపహరించాడన్న నింద మోపబడింది. ఒకని మీద. సాక్ష్యం—చూసిన సాక్ష్యం—విన్న సాక్ష్యం మొదలయినదంతా డిస్కసు చేసి ఆ నిందితుడి కేసు ఋజువు కాలేదని వొదిలేసారు చివరకు. నగలు కోసం పసిపాప ప్రాణాలు హరించిన ఆ మనిషిని అట్లా వదిలేసేసరికి కలం అక్కడపారేసి "ఈలాంటి జడ్జిమెంటు నేను రాయను" అన్నాను. "దుష్ట శిక్షణ చేయటానికి మిమ్మల్ని ఆ కుర్చీలో కూర్చోపెడితే ఇదా మీరు చేసేపని!" అని అతిఉద్రేకంతో స్యాయస్థానాలను, న్యాయమూర్తులను ఒక్కుమ్మడిగా నిందించాను. నా ఉద్రేకం చల్లారాక పది మంది నేరస్థులు శిక్ష తప్పించుకున్నా పరవాలేదు కాని ఒక నిరపరాధికి శిక్షపడకూడదు అని నచ్చ చెప్పేటప్పటికి నిజమేననిపించింది

'ఎన్నని చెప్పేది నాయెంకి ముచ్చట్లు!' అన్నట్లు ఇట్లాంటివి చెప్పటానికి కూచుంటే తరగవు!

టాక్ అంతా రాసేశాను. కాగితాలు నంబరు వేస్తుంటే "ఏమిటి రాస్తున్నావు" అన్నారు. "మిమ్మల్ని గురించే" అన్నాను "ఆఁ జాగ్రత్త. కంటెమ్టు (Contempt) కింద రాగలదు" అని హెచ్చరించారు.



వచ్చి రాకముందే నన్ను డిస్మిస్ చేశానంటివే.

ఏదో కులాసాకోసం రాసుకుంటే Contempt అంటారు నేను చెప్పానుగా ఇదివరకే! ఆ వెలక్కాయంత వెర్రి టెంకాయంత అవుతోంది!

నిజంగా ఇటువంటి వాళ్లతో కాపరం ఎవరితరం అనిపించినా మునిమాణిక్యంగారన్నట్టు సుకుమార సుందర దశాలల్లో వికసించిన గులాబిపువ్వుకు తొడిమ దగ్గర ఒకటి రెండు ముళ్లు ఉంటే మాత్రం ఏం? దాని సౌరభము సౌందర్యము, మార్దవమూ ఆకర్షించి మనలను కట్టేసుకుంటుంది? ★